కేసీ రైతులకు కష్టాలు

● సాగు నీరందక ఇబ్బందులు పడుతున్న రైతులు ● స్లూయిస్ ఏర్పాటు చేస్తేనే సమస్యకు పరిష్కారం



తూడిచర్ల సమీపంలోని కేసీ కాల్వను పరిశీలిస్తున్న రైతులు



మూసుకుపోయిన కేసీ ఆయకట్టు కాలువ

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూడిచర్ల వద్ద కేసీ ప్రధాన కాల్వ 114 స్లూయిస్ సమీపంలో పంటకాల్వలకు సక్రమంగా నీరందక ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎస్సార్బీసీ కాల్వపై సూపర్ ప్యాసెజ్(ఇనుముతో తయారు చేసిన కాల్వ)ను ఏర్పాటు చేశారు. దాని ద్వారానే ఆయకట్టు రైతులు సాగునీరు పెట్టుకునేవారు. ఎస్సార్బీసీ విస్తరణ పనుల్లో భాగంగా సూపర్‌ప్యాసెజ్ తొలగించారు. దీంతో రైతులు గత రెండు సంవత్సరాల నుంచి సాగునీటికి ఇబ్బందులకు గురౌతున్నారు. కేసీ కాల్వకే చిన్నరంధ్రం పెట్టడంతో ఉన్న 120 ఎకరాలకు సాగునీరు అందక ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు పంటకాల్వలు కూడా కంపచెట్లతో నిండిపోయి మూసుకుపోయాయి. ఎప్పుడైనా పంటలు ఎండిపోతున్నాయని కేసీ కాల్వకు రాళ్ల అడ్డంగా వేస్తే దిగువ ఉన్న వేల్పనూరు, రేగడగూడూరు గ్రామాల రైతులు వచ్చి తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి కేసీకాల్వకు స్లూయిస్ ఏర్పాటు చేసి పంటకాల్వను వెడల్పుచేస్తే సమస్య పరిష్కారం అవుతుందని రైతులు చెబుతున్నారు. ఆయకట్టు కింద మొక్కజొన్న, మినుము, జొన్న పంటలు సాగుచేశారు.

శాశ్వత పరిష్కారం చూపించండి..



ఎస్సార్బీసీ కాల్వపై సూపర్‌ప్యాసెజ్ కాల్వ ఉన్న సమయంలో సాగునీటికి ఇబ్బంది పడలేదు. విస్తరణ సమయంలో తొలగించడం వల్ల చాలా సమస్యలు వస్తున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. కాల్వపై తూము ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపండి.

-మద్దిలేటి, కేసీ రైతు, తూడిచర్ల

ప్రజాప్రతినిధులు స్పందించాలి



అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఈ సమస్య పరిష్కారం కావడంలేదు. కాల్వకు అడ్డంగా రాళ్లు వేసిన సమయంలో దిగువ ప్రాంత రైతులు వచ్చి తొలగిస్తున్నారు. ప్రజాప్రతిధులు స్పందించి సమస్య పరిష్కరించేందుకు కృషిచేయాలి.

- జయరాముడు, తూడిచర్ల, రైతు

పెండింగ్ బిల్లులకు మోక్షం

● జిల్లాలో రూ.3.84 కోట్లు పెండింగ్ ● నివేదిక సమర్పించిన అధికారులు ● సర్కారు సానుకూల స్పందన ● కాంట్రాక్టర్లలో ఆనందోత్సాహం

నంద్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో కక్ష సాధింపుతో ఆగిపోయిన పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కూటమి సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2014-18 మధ్యలో పంచాయతీ రాజ్ శాఖ పరిధి (ఎంజీఎన్‌ఆర్‌జీఎస్) కింద పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఐదేళ్ల పాలనలో వైసీపీ సర్కారు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో బాధిత కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఈ నేపథ్యంలో జిల్లాలో రూ.3.84 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయని అధికార యంత్రాంగానికి ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో సానుకూలంగా స్పందించిన కూటమి సర్కారు బిల్లుల చెల్లింపునకు ఆమోదం దెలిపింది. బిల్లులు చెల్లించే విధంగా తగిన అదేశాలు జారీ చేయడంతో కాంట్రాక్టర్లలో ఆనందోత్సాహం నెలకొంది.

జిల్లాలో 2014-18 జరిగిన పనుల పెండింగ్ బిల్లులు

- జిల్లా వ్యాప్తంగా జరిగిన పనుల సంఖ్య : 1173
- ఆయా పనుల పెండింగ్ బిల్లులు : రూ. 3.84 కోట్లు

ప్రభుత్వానికి నివేదిక...

2014-18 సంవత్సరాల మధ్య చేసిన పనులకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం బిల్లులను పెండింగ్‌లో పెట్టింది. బాధిత కాంట్రాక్టర్లను ఆర్థికంగా పలు ఇబ్బందులకు గురి చేసింది. గత ఐదేళ్ల పాలనలో కార్యాలయాలు చుట్టూ తిరిగినా పట్టించుకున్న పాపాన పోలేదు. పూర్తయిన పనులకు కూడా బిల్లులు చెల్లించలేదు ఈ విషయాన్ని గ్రహించిన ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ టీడీపీ అధికారంలోకి రాగానే బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం ప్రభుత్వం తగిన బిల్లుల చెల్లింపునకు శ్రీకారం చుట్టింది.

సమగ్ర నివేదిను ప్రభుత్వానికి పంపించాం

పెండింగ్ బిల్లుల నివేదికను ప్రభుత్వానికి పంపించాం. త్వరలోనే ఆయా కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది. బిల్లుల కోసం గతంలో చాలా మంది కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడిన మాట వాస్తవమే.

- జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ, ఈఈ నాగరాజు



జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయం

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తా

● ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ● పోలీస్ గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తానని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌లో ఎస్పీ పాల్గొని సిబ్బంది నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పదిమంది సిబ్బంది మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై విన్నవించుకున్నారు. సిబ్బంది సమస్యలను విని పరిశీలించి తగిన పరిష్కారం చూపుతానన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది సమస్యలను నిర్భయంగా తెలియజేయవచ్చన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది సతమతమవకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

ఎంపీడీవో శివరామయ్యకు రిమాండ్



బనగానపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఎంపీడీవోగా పనిచేస్తూ సస్పెండ్ అయిన శివరామయ్యను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. శివరామయ్య గతంలో పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈవోగా పని చేశారు. అనంతరం బనగానపల్లె మండల ఈవోఆర్డీగా, ఎంపీడీవోగా కూడా విధులు నిర్వర్తించారు. బనగానపల్లె ఎంపీడీవోగా పని చేస్తున్న సమయంలో ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారన్న ఆరోపణలు వచ్చాయి. అలాగే పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈవోగా పని చేసే సమయంలో బిల్ కలెక్టరు పుల్లయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. తనను శివరామయ్య పర్మినెంట్ చేస్తానని చెప్పి మోసం చేశారని, ఆత్మహత్యకు ఆయనే కారణమని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పుల్లయ్య కుమారుడు ఫిర్యాదు మేరకు, పుల్లయ్య సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు శివరామయ్యను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు.

కంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన కందుల రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథరెడ్డి తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటుచేసిన కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన కంది రైతులకు రూ.1,35,90,000 జమ చేశామన్నారు. డబ్బు జమ కాని రైతులు మార్క్‌ఫెడ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వీరభద్రా.. పాహిమాం...

● భక్త జనసంద్రమైన హోసూరు ● ఘనంగా వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం



అశేషజనవాహిని నడుమసాగుతున్న రథోత్సవం

పత్తికొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలంలోని హోసూరు గ్రామం వీరభద్రస్వామి నామస్మరణతో మార్మోగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసింది. భద్రకాళీ, వీరభద్రేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కానుకలను సమర్పించారు. సాయంత్రం అశేష భక్తజనసందోహం నడుమ రథోత్సవాన్ని కొనసాగించారు. రథోత్సవానికి ముఖ్య అతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రథానికి కొబ్బరికాయకొట్టి రథాన్ని భక్తులతో కలిసి ముందుకు లాగారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిని వెంకట్రాముడు, రామానాయుడు, నాయకులు రాజశేఖర్, వాకిటిసాయి, జగ్గులఅంజి, రాఘవేంద్ర, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ జయన్న సిబ్బందితో బందోబస్తును పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై 10న సమీక్ష

శ్రీశైలం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈ నెల 10న మంత్రుల బృందం సమీక్షించనుందని ఈవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు. సమీక్షలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, హోం శాఖ మంత్రి వి. అనిత, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎం డి. ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, శాసనసభ్యుడు బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవదాయ శాఖ కార్యదర్శి, కమిషనర్, కలెక్టర్ తదితరులు సమావేశంలో పాల్గొంటారని ఈవో తెలిపారు.

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

బ్యాంకు మేనేజర్లతో కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రుణాలు విరివిగా మంజూరు చేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజకుమారి బ్యాంకు మేనేజర్లకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బ్యాంకు మేనేజర్ల జిల్లా ఓరియంటేషన్ వర్క్‌షాపులో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పర్యాటక రంగం, బలహీనవర్గాల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర ప్రాథమిక రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి రుణాలు ఇవ్వాలన్నారు. సంగమేశ్వరం, కృష్ణానది పరివాహక ప్రాంతంలో సాగు నీటి కాలువల కింద 5.97 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకుంటున్నారని, రైతులకు అవసరమైన సమయంలో రుణాలు ఇవ్వాలని సూచించారు. అరటి రైతులకు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇచ్చే పంటలకు, స్థిరమైన వ్యవసాయ ఉత్పత్తుల కోసం, చేప పిల్లల పెంపకం కోసం, పాడి రైతులకు అధిక పాలు ఇచ్చే గేదెల కొనుగోలు కోసం రుణాలు ఇచ్చి సహకరించాలన్నారు. చెంచుగూడెంలో గిరిజనులకు పీఎం జన్‌మన్ కింద గృహాలు నిర్మించి ఇచ్చేందుకు వచ్చే ఏజన్సీల వారికి బ్యాంకర్లు సహకరించాలన్నారు. జేసీ విష్ణుచరణ్ మాట్లాడుతూ బ్యాంకర్లు, జిల్లా అధికారుల సమన్వయంతో కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.

నగర పాలక సంస్థ పీఆర్వో బదిలీ

ఆళ్లగడ్డ కమిషనర్‌గా కిషోర్

కర్నూలు న్యూసిటీ/ శిరివెళ్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర పాలక సంస్థ సూపరింటెండెంట్, ప్రజా సంబంధాల అధికారి(పీఆర్వో) రమేష్‌బాబు బదిలీ అయ్యారు. ఆయన్ను గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా నియమిస్తూ శుక్రవారం పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు కమిషనర్‌గా పని చేస్తున్న బి.నాగరాజును నగర పాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్‌గా నియమించారు. కాగా గతంలో రమేష్‌బాబు ఆళ్లగడ్డ, డోన్ మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా పని చేశారు. అదేవిధంగా ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా(ఎఫ్ఏసీ) పని చేస్తున్న కిషోర్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ వెంకటరామిరెడ్డి సెలవుపై వెళ్లడంతో కడప నగరపాలక సంస్థలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిషోర్‌ను ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న గంగిరెడ్డిని బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలోని ఏపీజీబీసీఎల్‌లో పని చేస్తున్న జి.రవిని ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. గంగిరెడ్డిని సీడీఎంఏకు బదిలీ చేశారు.



కిషోర్

అనధికార లేఅవుట్లపై చర్యలు

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు 7

కార్మికుల ప్రయోజనాలు కాపాడుతాం

మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు 7

సొసైటీని రద్దు చేయాలి : కాంగ్రెస్

ఎట్టకేలకు కదలిక

● ప్రారంభమైన రింగ్ రోడ్డు పనులు ● తీరనున్న ట్రాఫిక్ కష్టాలు



బనగానపల్లె పట్టణ శివారులో రింగ్ రోడ్డు పనులు

బనగానపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె రింగ్ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. బీసీ జనార్దన్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖా మంత్రి పదవీ బాధ్యతలు చేపట్టడంతో పనులను ప్రారంభించారు. దీంతో బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరనుంది. రింగ్ రోడ్డు లేకపోవడంతో బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్‌కు నిత్యం అంతరాయం కలుగుతోంది. ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. బనగానపల్లె సమీపంలోని యనకండ్ల వద్ద నిర్మించిన జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ, కొలిమిగుండ్ల మండలంలో నిర్మించిన రామ్‌కో సిమెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలు, ప్యాపిలి మండలంలోని బూరుగుల సమీపంలో నిర్మించిన ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు బనగానపల్లె పట్టణం మీదుగా వెళతాయి. ఈ ఫ్యాక్టరీలకు అవసరమైన బొగ్గు, సుద్ద, సిమెంట్‌ను, ఇతర ముడి ఖనిజాలను భారీ వాహనాల్లో బనగానపల్లె మీదుగా తరలిస్తుంటారు. దీంతో బనగానపల్లె పట్టణంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. దీంతో 2019 సంవత్సరంలో రూ.50 కోట్ల వ్యయంతో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రింగ్ రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో రింగ్ రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోయాయి. తిరిగి ఇప్పుడు పనులు ప్రారంభం కావడంతో పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరనుంది.

18 నెలల్లో పూర్తికి కసరత్తు

బనగానపల్లె రింగ్ రోడ్డును పట్టణ శివారులోని యాగంటిపల్లె ప్రధాన రహదారి నుంచి పాణ్యం రహదారి వరకు రోడ్డు నిర్మించనున్నారు. 18 నెలల్లోనే రింగ్ రోడ్డు పనులు చేయాలని మంత్రి ఆర్‌అండ్‌బీ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. దీంతో ఆ మేరకు పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి అన్నారు.



రోడ్డు పనులకు మట్టిని వేస్తున్న టిప్పర్

రాయితీ ఇంధనం



● పెట్రోల్, డీజిల్ ఖర్చులో 50 శాతం సబ్సిడీ ● దివ్యాంగులు అర్హులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల వాహనాలకు ప్రభుత్వం 50శాతం రాయితీపై పెట్రోల్, డీజిల్ అందించనుంది. స్వయం ఉపాధి పొందుతూ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్న దివ్యాంగులకు ఈ పథకం వర్తిస్తుంది. ఒక్కొక్క లబ్ధిదారునికి గరిష్ఠంగా నెలకు రూ.2వేలు వరకు లబ్ధి చేకూరుతుంది. ఈ ఆర్థిక తోడ్పాటుతో దివ్యాంగులు కాస్త నిలదొక్కుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. మూడు చక్రాల మోటారు వాహనాలు వినియోగించే దివ్యాంగులకు ఇంధనం భారం లేకుండా చేసేందుకు 2014-19లోనే నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయితీపై పెట్రోల్, డీజిల్ అందించే పథకాన్ని అమలు చేశారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని నిర్లక్ష్యం చేసింది. ఈ పథకం కోసం కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీన్ని పునరుద్ధరించి దివ్యాంగులకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టింది.

విద్యార్థులు అయితే స్టడీ సర్టిఫికెట్, ప్రైవేటు వ్యక్తులైతే సంబంధిత కార్యాలయంలో పని చేస్తున్న అధికారి చేత ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలి. వ్యాపారులైతే ఎంపీడీవో ద్వారా లేదా సంబంధిత పంచాయతీ సెక్రటరీ ద్వారా ధ్రువీకరణ పత్రం పొందాలి. దరఖాస్తు ఫారాన్ని జిల్లా వయోవృద్ధుల విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

కావాల్సిన ధ్రువపత్రాలు

- దరఖాస్తు ఫారం
- సదరం సర్టిఫికెట్
- రేషన్‌కార్డు
- బ్యాంక్ పాస్ పుస్తకం (మొదటి పేజీ)
- ఆధార్ కార్డు
- వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం
- డ్రైవింగ్ లైసెన్సు
- వాహన రిజిస్ట్రేషన్ పత్రం

దరఖాస్తు చేసుకోవాలి



దివ్యాంగుల వాహనాలకు కూటమి ప్రభుత్వం 50 శాతం రాయితీపై పెట్రోల్, డీజిల్‌ను అందించనుంది. స్వయం ఉపాధి పొందుతూ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న దివ్యాంగులకు ఈ పథకం వర్తించనున్నది. జిల్లాలోని అర్హులైన దివ్యాంగుల వాహనదారులు రాయితీ ఇందనం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

-రయీస్ ఫాతిమా, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల జిల్లా సంక్షేమ అధికారి

30 లీటర్ల ఇంధనం రాయితీ

2 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన వాహనాలకు నెలకు గరిష్ఠంగా 15 లీటర్లు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన వాహనాలకు 30 లీటర్ల వరకు ఇంధన రాయితీ వర్తింపజేయనున్నారు. దీనికి సంబంధించిన బిల్లులను మూడు నెలలకు ఒకసారి సమర్పించాల్సి ఉంటుంది. తర్వాత రాయితీ సొమ్మును నేరుగా లబ్ధిదారుడి ఖాతాకే ప్రభుత్వం జమ చేయనున్నది. లబ్ధిదారుడు ఇంటి నుంచి తాను పని చేసే ప్రదేశానికి వెళ్లే దూరానికి వినియోగించే పెట్రోల్, డీజిల్ ఖర్చులో 50 శాతం రాయితీ అందిస్తారు.

రేపటి నుంచి ఘంటసాల ఆరాధనోత్సవాలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ నేపథ్య గాయకుడు, దివంగత ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం నుంచి మంగళవారం వరకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'ఘంటసాల ఆరాధనోత్సవాలు' నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం, ఘంటసాల గాన కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల ఘంటసాల ఆరాధనోత్సవాల్లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కర్నూలు గాయకులు సుధారాణి, శ్రీనివాసులు, హబీబ్ తదితరులు ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. కన్వీనర్‌గా గాయకుడు చంద్రకంటి మద్దయ్య వ్యవహరిస్తారని తెలిపారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాదుకు చెందిన గాయకులు అఖిల, పీవీ రమణ బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందని, కన్వీనర్‌గా బీఎస్ రావు వ్యవహరిస్తారని తెలిపారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాదు గాయకులు వాణికుమారి, వీరలక్ష్మి, పి. రవీందర్, డాక్టర్ వీఎస్ మూర్తిల బృందం ఆధ్వర్యంలో జరిగే సంగీత విభావరికి హైదరాబాదు ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కేవీ రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వారు వివరించారు.

నేడు, రేపు విరసం 24వ 'సాహిత్య పాఠశాల'

హాజరవుతున్న ప్రముఖ కవులు, రచయితలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విప్లవ రచయిత సంఘం (విరసం) ఆధ్వర్యంలో 24వ సాహిత్య పాఠశాలను 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు విరసం నాయకులు పాణి, నాగేశ్వరాచారి తెలిపారు. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ పక్కనగల వెంకటేశ్వర కల్యాణ మంటపం వేదికగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన కవి, విప్లవ మేధావి, ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మృతిపథంలో ఈ వేదికకు 'కామ్రేడ్ సాయిబాబా ప్రాంగణం'గా నామకరణం చేశామని చెప్పారు. శనివారం ఉదయం 10.30 గంటలకు పతాక ఆవిష్కరణ, 11 గంటలకు అరుణ్ ఆహ్వానం, అరసవిల్లి కృష్ణ అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరుడు ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంతకుమారి ప్రారంభోపన్యాసం చేస్తారని అన్నారు. అనంతరం ఆయా అంశాలపై వక్తలు ప్రసగిస్తారని పేర్కొన్నారు. అలాగే ఆదివారం ఉదయం 10 గంటలకు పుస్తక ఆవిష్కరణ, 11.30 గంటలకు వరలక్ష్మి అధ్యక్షతన 'తెలుగు సాహిత్యంలో వెలుగు నీడలు' అనే అంశంపై అరసవిల్లి కృష్ణ, మధ్యాహ్నం 2.30 గంటలకు సాగర్ అధ్యక్షతన 'విప్లవోద్యమంపై ఫాసిస్టు యుద్ధం - రచయితలు, బుద్ధిజీవుల పాత్ర' అనే అంశంపై పాణి ప్రసంగిస్తారని తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ఊరేగింపు, 5.30 గంటలకు జరిగే బహిరంగ సభకు కె. నాగేశ్వరాచారి అధ్యక్షత వహిస్తారని, వక్తలుగా జి. కల్యాణరావు, శశికళ, ప్రొఫెసర్ హరగోపాల్, బొజ్జా దశరథరామిరెడ్డి (రాయలసీమ సాగునీటి సాధన సమితి) ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ఉరకలేసిన ఉత్సాహం

ముగిసిన బాలోత్సవం



ముగింపు వేడుకల్లో మాట్లాడుతున్న డీఈఓ

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఇండస్ పాఠశాల వేదికగా రెండు రోజుల పాటు సాగిన బాలోత్సవం శుక్రవారం ముగుసింది. రెండో రోజు 27 అంశాల్లో పోటీలను నిర్వహించారు. మూడు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, కోలాటం నిర్వహించారు. మధ్యాహ్నం బాలోత్సవం అధ్యక్షులు బడే సాహెబ్ అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ మాట్లాడుతూ విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొనడం విద్యా శాఖకే గర్వకారణమన్నారు. పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పిల్లల్లోని సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని బయటకు తీయడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బాలోత్సవంలో పాల్గొనే విద్యార్థులు, పోటీ అంశాల సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీయాలనే సదుద్దేశం బాలోత్సవం వెనుక ఉందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రమాదకరమైన సెల్‌ఫోన్ల నుంచి దూరంగా ఉండేందుకు సహాయ పడతాయన్నారు. ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ భరత్ మాట్లాడుతూ బాలోత్సవం పెద్ద ఈవెంటుగా మారిందన్నారు. పిల్లలను చిన్నప్పటి నుంచి సృజనాత్మకతను పెంచేందుకు ఈ కార్యక్రమం సహాయ పడుతుందన్నారు. ఏపీఎస్‌పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఈ వేడుకల్లో పాల్గొనేందుకు పిల్లలు తపన పడుతున్నారని, అంతే బాగా ప్రదర్శనలు ఇస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను కూడా బయటకు తీయడానికి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా డీ టైటిల్ విన్నర్, ఆర్టిస్ట్ హేమంత్ ప్రదర్శించిన నవరసాలతో కూడిన డాన్స్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ రాష్ట్ర నాయకులు రామరాజు, మాంటిస్సోరి విద్యాసంస్థల సీఈవో విల్సన్, ప్రిన్సిపాల్ మీనాక్షి విల్సన్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే సురేష్ కుమార్, బాలోత్సవం కన్వీనర్ ధనుంజయ, ప్రధాన కార్యదర్శి శేషయ్య, ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు జయరాజు, జిల్లా అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జన విజ్ఞాన జిల్లా అధ్యక్షులు సుధీర్‌రాజు, రిటైర్డ్ హెచ్‌ఎం ఈ.పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్సర్ హేమంత్ ప్రదర్శన

క్రీడాకారులకు నజరానా

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గోవాలో గత ఏడాది జరిగిన జాతీయ క్రీడలతోపాటు వివిధ క్రీడల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన 189 మంది క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7.91 కోట్ల నజరానాలను మంజూరు చేసింది. గత ఏడాది హామీకే పరిమితమైన క్రీడా పురస్కారాలు ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో శుక్రవారం పతకాలు సాధించిన క్రీడాకారుల ఖాతాల్లో అధికారులు జమ చేశారని జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఒలింపిక్ అసోసియేషన్ ట్రెజరర్ శ్రీధర్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, అవినాష్ శెట్టి, సునీల్, పాల్గొన్నారు.

పాడి రైతుకు భరోసా..

● లక్ష్యానికి మించి దరఖాస్తులు
● పశు కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి రూ.మూడు లక్షల నుంచి రూ. ఐదు లక్షలకు పెంపు వల్లే



కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో నష్టాలపాలవుతున్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున పథకాలను అమలు చేస్తున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూగ జీవాలకు నీడ కల్పించడంతో పాటు పశుగ్రాసం సమకూర్చుకునేందుకు పెద్ద ఎత్తున సీఎం చంద్రబాబు నాయుడు నిధులను కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 2,200 గోకులాల షెడ్లను రైతులు ఏర్పాటు చేసుకునేందుకు నిధులను సమకూర్చారు. అదేవిధంగా పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో రైతులు రుణం కోసం బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు ఎనిమిదివేల పశువులు, 20వేల జీవాలు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. పాడి రైతులకు దానాతో పాటు మేత కొనుగోళ్లకు గడ్డి కత్తిరించే యంత్రాలకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. ఈ ఇబ్బందులను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం గతేడాది నుంచి పశుకిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరుకు అవకాశం కల్పించింది. కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరం 6,676 పశుకిసాన్ క్రెడిట్ కార్డులను రైతులకు అందించాలనే లక్ష్యం కాగా, రైతుల నుంచి విశేష స్పందన లభించినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు. ఏకంగా 13,433 దరఖాస్తులు రైతుల నుంచి అందాయని, వీటిని బ్యాంకులకు పంపామని, త్వరలోనే రుణాలు మంజూరవుతాయని తెలిపారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 7,300 పశుకిసాన్ క్రెడిట్ కార్డులను రైతులకు పంపిణీ చేసే లక్ష్యం కాగా 9,596 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తులను బ్యాంకులకు పంపామని, త్వరలోనే రుణాలు మంజూరవుతాయన్నారు. ఇటీవల వరకు గరిష్ఠంగా ఒక్కో రైతుకు యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.1.6 లక్షల రుణం ఎలాంటి హామీ లేకుండా బ్యాంకులు ఇస్తున్నాయనీ, దీనిని జనవరి నుంచి రూ. రెండు లక్షల వరకు పెంచిందని జేడీ శ్రీనివాస్ తెలిపారు. ఆ పై మొత్తానికి బ్యాంకులకు తప్పనిసరిగా పూచీకత్తు రైతులు చూపించాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం రుణ మొత్తాన్ని రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచడం వల్ల రూ. 2 లక్షల రుణం వరకు ఎటువంటి పూచి రైతులు బ్యాంకులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్డులు ఉంటే రైతులు అవసరమైన సమయంలో బ్యాంకుల్లో నగదు తీసుకుని పశుపోషణ వనరులు సమకూర్చుకోవచ్చని, తీసుకున్న సొమ్మును 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదని, ఆ పై చెల్లిస్తే 40 శాతం వడ్డీ బ్యాంకులు వసూళ్లు చేస్తాయన్నారు. ఇందులో మూడు శాతం ప్రభుత్వం రాయితీగా అందించడం వల్ల తక్కువ వడ్డీతో రైతులు పాడిపరిశ్రమ ద్వారా జీవనోపాధిని మెరుగుపరుచుకోవచ్చని జేడీ తెలిపారు.

టీఎల్‌ఎంతోనే విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగు : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగు పడాలంటే కచ్చితంగా బోధన అభ్యసన సామగ్రిని వినియోగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర బీఈడీ కళాశాలలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఎఫ్‌ఎల్‌ఎన్ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఒకరి అనుభవాలు మరొకరితో పంచుకోవడానికి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలపై సానుకూల ధోరణి కలిగి ఉండాలని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా టీఎల్‌ఎం మేళాను సందర్శించి ఉపాధ్యాయులు తయారు చేసిన టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్స్‌ను చూసి అభినందించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మేళాలో ప్రదర్శించిన నమూనాలు విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించే విధంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డా.రఫీ, జిల్లా కోఆర్డినేటర్ దావీదు, కేఆర్పీలు, డీఆర్పీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల కల్తీపై లోకాయుక్త సీరియస్

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో జరుగుతున్న పాల కల్తీ వ్యాపారంపై ఈ నెల 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర లోకాయుక్త తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు ఆంధ్రజ్యోతి కథనాన్ని రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని సుమోటోగా స్వీకరించి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం బండమీదపల్లితో పాటు అనంతపురం నగరంలోని పలు పాల కేంద్రాల్లో మాల్టోడెక్సిన్ అనే రసాయన పౌడర్‌ను పాలలో కలిపి విక్రయిస్తుండగా.. విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మాల్టోడెక్సిన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకుని పాల కేంద్రాలను సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని తీవ్రంగా స్పందించారు. పాల కల్తీని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేస్తూ రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్‌కు నోటీసులు జారీ చేసి కేసును మార్చి 24వ తేదీకి వాయిదా వేశారు.

శ్రీశైల క్షేత్రంలో తాడిపత్రి ఎమ్మెల్యే కుటుంబం

బంగారు కూర్మ సింహాసనం, పల్లెం సమర్పణ

శ్రీశైలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబ అమ్మవార్లను అనంతపురం జిల్లా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిలు శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి బంగారుతో తయారు చేసిన కూర్మ సింహాసనం, పల్లెంను సమర్పించారు. 379 గ్రాములతో తయారు చేసిన కూర్మ సింహాసనం, 249 గ్రాములతో తయారు చేసిన బంగారు పళ్లెంను అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఈఓ ఎం.శ్రీనివాసరావుకు దాతలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ అస్మిత్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డిలను శేష వస్త్రంతో ఆలయ అధికారులు, పూజాలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మార్కండేయ శాస్త్రి, ఏఈఓ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అధికారులకు బంగారు వస్తువులను అందజేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి కుటుంబ సభ్యులు

ఐదెకరాల్లో ఆలయం



డోన్‌లో నిర్మించిన షిరిడీ సాయిబాబా ఆలయం

● డోన్‌లో నిర్మితమైన షిరిడీ సాయిబాబా మందిరం
● వందలాది మంది భక్తుల సహకారంతో పూర్తి
● 9 నుంచి 12 వరకు ప్రత్యేక పూజలు
● 13న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

డోన్ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐదు ఎకరాల్లో పూర్తి చేసుకున్న అద్భుత నిర్మాణం.. దాతల సహకారం ఏర్పాటైన షిరిడీ సాయిబాబా ఆలయం.. 13న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సిద్ధమవుతోంది. డోన్ పట్టణ సమీపం లోని 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన నిర్మించిన షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 9వ తేదీ నుంచి 13 వరకు జరగనుంది. ఇందుకు షిరిడీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయ నిర్మాణానికి 2016లో పునాదిరాయి పడగా ఆ తరువాత వందలాది మంది భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యులయ్యారు. ఈ కరోనా సమయంలో కాస్త నిర్మాణం ఆలస్యమైనప్పటికీ చివరకు దాదాపు రూ.7 కోట్లతో తుది దశకు చేరుకుంది. షిరిడీ తర్వాత అత్యంత అధిక విస్తీర్ణం కలిగిన ఆలయంగా తీర్చిదిద్దారు. 120 అడుగులతో ఆలయ గోపురం నిర్మించారు. షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు భాష్యం వెంకట రమణగౌడు, చాటకొండ శ్రీనివాసులు, కందుకూరు పార్థసారథి, కొండా సురేష్, అడ్వకేట్ ఆలా మల్లికార్జున రెడ్డి, శ్రీరాములు కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

2016లో పునాదిరాయి

ఆలయ నిర్మాణానికి 2005లో ఐదెకరాల భూమిని సేకరించారు. 2016లో పునాదిరాయి పడింది. అదే సంవత్సరంలో భూమి పూజా కార్యక్రమం అశేష భక్త జనవాహిని మధ్య జరిగింది. అదే సంవత్సరంలో ఆలయ భూమి పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ ప్రతాప్ దంపతులు, ప్రస్తుత రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ధర్మవరం సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కేఈ జయన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ కోట్రికే గాయత్రీదేవి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, బాష్యం వెంకటరమణగౌడు తదితర నాయకులు, వేలాది భక్తుల మధ్య డోన్ మీదుగా భారీ ర్యాలీగా వెళ్లి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.

అందరి సహకారంతోనే..



డోన్ పట్టణంలోని హైవే రోడ్డులో షిరిడీ సాయిబాబా ఆలయ నిర్మాణం భక్తులందరి సహకారంతో పూర్తి చేశాం. ఈ నెల 9 నుంచి 12 వరకు ప్రత్యేక పూజలు, 13న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని భక్తులను విజ్ఞప్తి చేస్తున్నాం. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన కమిటీ సభ్యులకు, భక్తులకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

- ధర్మవరం సుబ్బారెడ్డి, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్

మానవ రూపంలో ఉన్న మహనీయుడు



సాయిబాబా లీలలు అద్భుతం. మానవ రూపంలో ఉన్న మహనీయుడు. ప్రజల మధ్య తిరుగుతూ మహిమలను చూపించిన మహిమాన్వితుడు. సాయిబాబాపై భక్తితో ఆలయ సమీపంలోనే ఇల్లు నిర్మించుకొని ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం. డోన్‌లో సాయిబాబా మందిరం ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది.

- సముద్రాల మాధవీలత, సాక్షి గ్రీన్ పార్కు, కాలనీవాసి, డోన్

ఆలయం నిర్మించడం సంతోషంగా ఉంది



డోన్‌లో హైవే సమీపంలో షిరిడీ సాయిబాబా ఆలయం నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉంది. ఆలయం నిర్మాణంలో డోన్‌కు ఒక ప్రత్యేకత లభించింది. సాయిబాబా ఒక శక్తి సంపన్నుడు. కులమతాలకతీతంగా అందరినీ దగ్గరకు తీసుకున్న మహిమాన్వితుడు. యేసు, అల్లా, ఈశ్వరుడు అంతా ఒక్కటే అని చాటిచెప్పిన మహాయోగి సాయిబాబా.

- రాంపుల్లయ్య, వ్యాపారవేత్త, టీచర్స్ కాలనీ, డోన్



జూపాడుబంగ్లా కేసీ కాల్వ వంతెనపై అడ్డుగా ఉన్న గేదెలు

పశువులతో నిరసన

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గేదెల యజమానులకు కోపం రావడంతో ఆ పశువులను జాతీయ రహదారిపై అడ్డంగా వదిలి నిరసన వ్యక్తం చేసిన సంఘటన జూపాడుబంగ్లా మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. జూపాడుబంగ్లాకు గేదెలను కేసీకాల్వ ఆయకట్టు కింద పంటల నూర్పిడి అనంతరం ఎన్నో ఏళ్ల నుంచి గేదెలు మేపుకుంటున్నారు. వారం రోజుల నుంచి 80బన్నూరు పొలిమేరలోకి పశువులు రాకూడదని గ్రామస్థులు చెప్పారంటూ కావలిదారు అడ్డుకుంటున్నారు. శుక్రవారం కూడా అదే తరహాలో అడ్డుకోవండతో పశువుల యజమానులంతా తిరగబడ్డారు. కేసీకాల్వ వంతెనపై అడ్డుకోవడంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు అరగంట పాటు తీవ్రఅంతరాయం కలిగింది. ఈ సమయంలో ఓ వాహనం గేదెలను ఢీకొనడంతో ఓ గేదెకు కాలు విరిగింది. అనంతరం పశువుల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారిస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ వెల్లడించారు.

ఎద్దుల బలప్రదర్శన

మిడుతూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రోళ్లపాడులో కొలువైన బరక సంజీవరాయ స్వామి వార్షికోత్సవం సందర్భంగా ఎద్దుల బలప్రదర్శన రాష్ట్ర స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం న్యూ కేటగిరీ విభాగంలో 12 జగతల ఎద్దులు పాల్గొన్నారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. అనంతరం గెలుపొందిన ఎద్దుల యజమానులకు కమిటీ నిర్వాహకులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.



బండ లాగుతున్న ఎద్దులు

చెట్నహాల్లిలో 82 మందిపై కేసు నమోదు

- విచారణ చేపట్టిన డీఎస్పీ ఉపేంద్రబాబు



శ్మశానాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహాల్లి గ్రామ శ్మశాన స్థల వివాదం కేసులో 82 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా ఎస్సీ, బీసీల మధ్య శ్మశాన స్థలం విషయమై వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే బీసీ వర్గాలకు చెందిన 50 మందిపై మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బీసీ వర్గాల వారు కూడా ఫిర్యాదు చేయడంతో ఎస్సీ వర్గానికి చెందిన 32 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. డీఎస్పీ ఉపేంద్రబాబు చెట్నహాల్లిలో శుక్రవారం ఇరువర్గాలను విచారించారు.

కార్మికుల ప్రయోజనాలు కాపాడుతాం

- మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు



హమాలీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మార్కెటింగ్ జేడీ

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ప్రయోజనాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు హామీ ఇచ్చారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో పని చేస్తున్న హమాలీలకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రయోజనాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మిని జేడీ ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్, అకౌంటెంట్ కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుమారుడి బాధ చూడలేక..

- ఉరివేసుకుని తల్లి ఆత్మహత్య

ఆత్మకూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పులు తిరిగి రాక.. చేసిన అప్పులు చెల్లించలేక కుమారుడు పడుతున్న బాధను చూసి భరించలేని ఓ తల్లి బలవన్మరణానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామంలో జరిగింది. వివరాలివీ.. నల్లకాల్వ గ్రామానికి చెందిన గుండం రాజారెడ్డి, సుమిత్ర (60) దంపతుల కుమారుడైన నవీన్ కొన్నేళ్లుగా ఫైనాన్స్, చీటిలు వేస్తూ ఉపాధి పొందేవాడు. అయితే కొంత మంది ఆయన వద్ద అప్పులు తీసుకొని తిరిగి చెల్లించకపోగా, మరికొందరు చీటీలను ఎత్తి తదుపరి కంతులను ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారు. ఈ లెక్కన సుమారు రూ.2 కోట్ల వరకు ఇచ్చిన అప్పులు రావాల్సి ఉందని తెలిసింది. ఈక్రమంలోనే ఆయన కొంతమేర అప్పులు చేసి మరీ తాను ఇవ్వాల్సిన వారికి డబ్బులు కడుతూ వస్తున్నాడు. అదేవిధంగా తనకు అప్పులు ఇచ్చిన వారు మాత్రం తిరిగి చెల్లించాలని ఒత్తిళ్లకు గురిచేస్తూ వచ్చారు. అయితే తనకు ఇవ్వాల్సిన వారు మాత్రం ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో చివరకు నవీన్ తల్లి సుమిత్ర స్వయంగా తన కుమారుడు ఇచ్చిన అప్పుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి తమ పరిస్థితిని వివరించినా వారు జాప్యం చేస్తూ వచ్చారు. వీరిలో చాలామందికి తీసుకున్న అప్పులు చెల్లించే స్థోమత, ఆస్తులు ఉన్నప్పటికీ ఇవ్వకుండా అతన్ని వేధిస్తూ వచ్చారు. అలాగే అతనికి అప్పులు ఇచ్చిన వారు ఇళ్ల వద్దకు వెళ్తుండగా వాళ్లందరికీ ఆ తల్లి కచ్చితంగా చెల్లిస్తామని ఎంతో మర్యాదపూర్వకంగా చెప్పేవారు. చివరకు ఇచ్చిన అప్పులు తిరిగి రాక.. చేసిన అప్పులు చెల్లించలేక తన కుమారుడు పడుతున్న మానసిక క్షోభను చూసి భరించలేని ఆ తల్లి ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. శుక్రవారం తన భర్త రాజారెడ్డి మార్నింగ్ వాక్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఉరివేసుకున్నారు. అంతకుముందు తెల్లవారుఝామునే ఆమె ఇంటిని శుభ్రపరిచి, పూజలు చేసి ఈ ఘాతుకానికి పాల్పడింది. నాలుగు పేజీల సూసైడ్ లెటర్‌ను రాసి అందులో తన ఆవేదనను వ్యక్తం చేసినట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ డి.రాము వెల్లడించారు.

ఆర్టీసీ బస్సులో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కడప జిల్లా మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన నాగయ్య(42) తాడిపత్రిలో బస్సు ఎక్కి జమ్మలమడుగు టికెట్ తీసుకున్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆయన బస్సు కొలిమిగుండ్ల దగ్గరికి రాగానే సీటు నుంచి కుప్పకూలి పడి పోయాడు. దీంతో డ్రైవర్ భయంతో బస్సును కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. వైద్యులు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీవో

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియయాలను పాటించాలని ఆర్టీవో భరత్ చావాన్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్టీవో భరత్ చావాన్, ట్రాన్స్‌ఫోర్ట్ ఇన్స్‌పెక్టర్ కే.రవీంద్ర కుమార్, ఎంవీ సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ మోటారు వెహి కల్ ఇన్స్‌పెక్టర్ ఎస్‌గణేష్‌బాబు, ఆటో మొబైల్ హెచ్‌వోడీ ఈశ్వర్‌రెడ్డి, జనరల్ హెడ్‌వో శ్రీధర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీవో భరత్ చావాన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసే వారు సీటుబెల్టులు తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చలపతి, హోంగార్డులు, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దతు ధర అందేదెప్పుడు ?

- వేరుశనగ, కంది రైతుల గగ్గోలు



మార్కెట్ యార్డుకు వచ్చిన వేరుశనగకాయలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర తమకు అందేదెప్పుడు అని ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు గగ్గోలు పెడుతున్నారు. వేరుశనగకాయలకు ప్రభుత్వం క్వింటానికి రూ.6,723లను మద్దతు ధరగా ప్రకటించిందని, అయితే.. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ట ధర రూ.6,088లు మాత్రమే పలికిందని, మధ్యస్థ ధర రూ.5,270లు, కనిష్ట ధర మరీ ఘోరంగా రూ.4,009లు మాత్రమే అందించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రేయింబవళ్లు కష్టపడితే కనీసం కూలీల డబ్బులు ఎల్లడం లేదని వాపోయారు. కంది రైతుల పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఒక పక్క మార్క్‌ఫెడ్ అధికారులు కందులు కొనుగోలుకు సంబంధించి క్వింటానికి రూ.7,550లు చెల్లిస్తుంటే.. కర్నూలు మార్కెట్ యార్డులో మాత్రం గరిష్ట ధర, మధ్యస్థ ధర రూ.7,149లు మాత్రమే వ్యాపారులు అందిస్తున్నారని, ఇదేమి ఘోరమని రైతులు ప్రశ్నించారు. శనగలకు గరిష్ట, మధ్యస్థ ధర రూ.5,689లు మాత్రమే అందిస్తున్నారనీ, కనిష్ట ధర కేవలం రూ.4,209లు మాత్రమే అందించారనీ రైతులు గగ్గోలు పెట్టారు. ఉల్లిగడ్డలకు గరిష్ట ధర రూ.2,311లు దక్కిందని, రెండు నెలల క్రితం రూ.4వేల నుంచి రూ.5వేలకు అమ్ముడుపోయిందని, ప్రస్తుతం అమ్మకానికి కేవలం 1,010క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని, అలాంటప్పుడు ధర ఎందుకు పెరగలేదని ప్రశ్నించారు. కేవలం వ్యాపారులు సిండికేట్ కావడం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందని రైతులు చెబుతున్నారు. ఎండుమిరపకాయలకు గత సంవత్సరం క్వింటానికి రూ.20వేల నుంచి రూ.30వేలు దక్కిందని, ప్రస్తుతం అందులో సగం కూడా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గరిష్ట ధర రూ.14వేలు, మధ్యస్థ ధర రూ.9,499లు, కనిష్ట ధర రూ.2,229లు మాత్రమే దక్కడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



ఆలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ లే ఔట్లపై ఉక్కుపాదం మోపుతామని కర్నూలు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ (కుడా) సోమిశెట్టి వెంకటేశ్వరులు హెచ్చరించారు. శుక్రవారం ఆలూరు అతిథి హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు సత్వర ప్రయోజనాలు అందించేదుకు ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రవేశ పెట్టిందన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ద్వారా సమూలమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. కుడా పరిధిలోని 896 గ్రామ పంచాయతీల పరిధిలో 300 చదరపు మీటర్ల విస్తీర్ణం వరకు స్థలంలో భవనం నిర్మాణ అనుమతులు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఆన్‌లైన్ పొందవచ్చన్నారు. మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో 115 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులు తీసుకున్న 15 రోజుల లోపల మిగిలిన వారందరు అనుమతులు తీసుకోకపోతే కూల్చివేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 278 అక్రమ లేఅవుట్లను గుర్తించినట్లు తెలిపారు.

జగన్‌ను ప్రజలు నమ్మరు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి అసత్యాలు చెబితే ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. నాలుగు సార్లు సీఎంగా పని చేసిన చంద్రబాబును ఏకవచనంతో సంబోధించిన తీరు బాగోలేదన్నారు. జగన్‌రెడ్డి సంస్కారం లేదని మండి పడ్డారు. ఒక ఆర్థిక ఉగ్రవాది ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 31 క్రిమినల్ కేసుల్లో నిందితుడు, ప్రజలకు సమాధానం చెప్పుకోలేక పారిపోయిన వ్యక్తి విలువలు, విశ్వసనీయత, విధ్వం సాల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గాడి తప్పిన పాలన, ఆర్థిక వ్యవస్థను చంద్రబాబు గాడిలో పెడుతున్న తీరును జీర్ణించుకోలేక అవాకులు చవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు.

ఎర్రచందనం, శ్రీగంధం చెట్లకు నిప్పు

క్రిష్ణగిరి, పిబ్రవరి 7: మండలంలోని చుంచు ఎర్రగుడి గ్రామంలో శుక్రవారం ఎర్రచందనం, శ్రీగంధం, మహాగని, టేకు చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గ్రామానికి చెందిన రైతు బండారు మద్దిలేటి ఐదు ఎకరాల్లో ఏడేళ్ల కిందట చెట్లను నాటుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెట్లు, డ్రిప్ పరికరాలు మొత్తం కాలిపోయాయి. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు మద్దిలేటి వాపోయాడు.



కాలిపోయిన శ్రీగంధం, ఎర్రచందనం చెట్లు

అక్రమ సొసైటీని రద్దు చేయాలి

స్టాంప్స్ రిజిస్ట్రార్ డీఐజీని కలిసిన ఏఐసీసీ సభ్యులు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కళా వెంకట్రావు భవనం సొసైటీని రద్దు చేయాలని నంద్యాల జిల్లా డీసీసీ, ఏఐసీసీ సభ్యుడు జె. లక్ష్మి నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా అధికారిని కలిసి ఓ వినతి పత్రం ఇచ్చారు. అనంతరం నగర అధ్యక్షులు జిలాని బాషా, మాజీ డీసీసీ కే బాబురావు, సీనియర్ నాయ కుడు అనంతరత్నం మాదిగలతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సొసైటీ పేరు మీదుగా మార్చుకున్న కర్నూలు జిల్లా అధ్యక్షుడు, సొసైటీలో ఉన్న సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఆస్తులపై ప్రతి కార్యకర్తకు హక్కు ఉందని, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సొసైటీ పేరు మీదుగా రిజిష్టర్ చేసుకోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. తప్పుడు ఆలోచనలతో పార్టీ ఆస్తులను కాజేయాలని కుట్ర జరుగుతోందనే అనుమానం కలుగుతోంద న్నారు. బాలస్వామి, లాజరస్, డోన్ ఇన్‌చార్జి మద్దిలేటి, పఠాన్, అబీబ్ ఖాన్, రజాక్, విశ్వేశ్వరరెడ్డి, వెంకట్ నాయుడు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీకృష్ణ స్పీచ్ సెంటర్‌లో వైద్య శిబిరం

కొత్త టెక్నాలజీతో వినికిడి యంత్రాలు



వినికిడి పరీక్ష చేస్తున్న డాక్టర్ బి.శివకృష్ణ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు గౌరిగోపాల్ హాస్పిటల్ దగ్గర వుడ్ ల్యాండ్ కాంపౌండ్‌లో శ్రీకృష్ణ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటరులో 19వ వార్షికోత్సవం సందర్భంగా సిగ్నియా కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం చెవుడు, మాటలురాని వారికి ఉచిత వైద్యశిబిరాన్ని సెంటర్ అధినేత బి.శివకృష్ణ నిర్వహించారు. ప్రస్తుతం జర్మనీ టెక్నాలజీ కలిగిన సిగ్నియా కంపెనీ వినికిడి డిజిటల్ మిషన్లు, కంపెనీ ఆడియాలజిస్టు ఎస్.సతీష్, కంపెనీ ఆర్ఎస్ఎం ప్రవీణ్ రెడ్డి, ఏఎస్ఎం మహేశ్వరరెడ్డి తరుపున బ్లూటూత్‌లు రీచార్జిబుల్ హియరింగ్ ఎయిడ్‌పై 30 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు. దాదాపు 60 మందికి వినికిడి పరీక్షలు చేశామని, ఈ శిబిరం సోమవారం వరకు కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ ఆర్.శ్రావంతి, డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ బి.శ్రావంతి, డాక్టర్ మాధురి, డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



కాలిపోయిన గుడిసె వద్ద బాధితులు

కోసిగి, పిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌లో శుక్రవారం గుడిసె దగ్ధమైంది. కౌతాళం నాగరాజు, పార్వతి దంపతులు ఉదయం తమ గుడిసెకు తాళం వేసి కూలీ పనులకు వెళ్లారు. తమ ఇద్దరు పిల్లలు గీతాంజలి, అభిరాంలను బడులకు పంపించారు. అయితే మధ్యాహ్నం 2 గంటల సమయంలో తాళం వేసి ఉన్న గుడిసెలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో సమీప కాలనీవాసులు, అంగన్‌వాడీ సెంటర్‌లోని ఆయా, టీచర్లు, పిల్లలు భయం భయంతో దూరంగా పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని కరెంట్‌ను నిలిపివేశారు. బీరువాలో ఉన్న రూ.70 వేల నగదు, 2 తులాల బంగారం, 20 తులాల వెండి కాళ్ల పట్టీలు, తిండి గింజలు, బట్టలు అగ్నికి కాలి పోయాయని బోరున విలపించారు. తమకు నిల్వ నీడ లేకుండాపోయిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

రమణీయం.. రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మిడుతూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రోళ్లపాడు అభయారణ్యంలో వెలిసిన బరక సంజీవరాయుడి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సంజీవరాయ స్వామితో పాటు సీతారాముల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టు వస్రాలతో అలంకరించి పూలతో అలంకరించి రథంపైన విగ్రహాలను అధిష్టించి రథాన్ని ఆలయం ఆవరణలో ప్రదక్షిణలు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో ధర్మకర్త పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి, కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం కలశస్థాపనం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల శ్రీనామనామ స్మరణల నడుమ శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ఓబులేసు, పోలీసు బలగాలతో బందోబస్తు చేపట్టారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మహానందిలో న్యాయాధికారి పూజలు



న్యాయాధికారి రాధారాణి దంపతులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో న్యాయాధికారి దంపతులు ప్రత్యేక అభిషేకార్చనలు నిర్వహించారు. కల్యాణ మంటపంలో వీరిని వేదపండితులు శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు(చిన్నా) ఉన్నారు.

గోశాల అభివృద్ధికి ప్రణాళిక: ఈవో



మహానందిలో గోశాలను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మహానందిలోని దేవస్థానం గోశాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం క్షేత్ర పరిధిలోని గోశాలను ఆయన సందర్శించారు. ఈవో మాట్లాడుతూ అడవికి అత్యంత సమీపంలో ఉండటంతో గోవులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రక్షణ చర్యల్లో భాగంగా ముందుగా గోశాల చుట్టూ ఆరు అడుగుల ఎత్తులో ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటుకు పనులను వెంటనే ప్రారంభించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఈవో ఆదేశించారు. గోవులు అడవి జంతువుల బారిన పడకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోశాల నుంచి మురుగు వెళ్లేందుకు సైడ్ కాలువలు, ఇంకుడు గుంతలు నిర్మించాలని సిబ్బందికి సూచించారు. ఏఈవో ఎర్రమల్ల మధు, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు, అర్చకుడు సుబ్బయ్యశర్మ ఉన్నారు.

నామినేటెడ్ పదవులు ఇప్పించాలి



పురందేశ్వరికి బుద్ధుడి విగ్రహాన్ని అందజేస్తున్న అభిరుచి మధు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో అర్హులైన సీనియర్ నాయకులకు కూటమి ప్రభుత్వంలో భాగంగా నామినేటెడ్ పదవులు ఇప్పించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కోరినట్లు జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు.

విజయవాడలో శుక్రవారం పురందేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి బుద్ధుడి విగ్రహాన్ని అందజేశారు. మధు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి న్యాయం చేస్తామని పురందేశ్వరి చెప్పినట్లు తెలిపారు. అలాగే మండల కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారన్నారు. వచ్చే వారంలో నంద్యాల జిల్లాలో పర్యటించనున్నట్లు పురందేశ్వరి చెప్పారన్నారు.

ఈ అన్నం ఎలా తినాలి ?

● మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన విద్యార్థి నాయకులు



కళాశాలలో ఉడకని అన్నం, పాఠశాలలో మెత్తగా వండిన అన్నం

పాణ్యం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉడకని అన్నం, మెత్తగా మారిన అన్నంను విద్యార్థులు ఎలా తినాలని విద్యార్థి నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం పాణ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ప్రతాప్ ఆధ్వర్యంలో పరిశీలించారు. గత వారం రోజులుగా విద్యార్థులు ఉడకని అన్నంతో భోజనం సరిగా చేయడం లేదని పేర్కొన్నారు. దాదాపు 400 మంది పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒకరోజు మెత్తగా ఉడకడంతో అన్నం తినడానికి ఇష్టపడడంలేదని పేర్కొనర్నారు. మరొకరోజు ఉడికీ ఉడకని అన్నం పెట్టారన్నారు. విద్యార్థి నాయకులు వేణు, విగ్నేష్, శ్రీరాం పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్'పై అవగాహన

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ సోలార్ విద్యుత్‌పై శుక్రవారం సాయంత్రం నంద్యాల విద్యుత్ కార్యాలయంలో సిబ్బందికి డీఈ రమేష్‌కుమార్ అవగాహన సదస్సు నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ గృహాలపై రూఫ్‌టాప్ సోలార్ కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈ రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వైద్య పరికరం విరాళం



ఆధునిక పరికరానికి పూజలు నిర్వహిస్తున్న ఈవో

సున్నిపెంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం వారు నిర్వహిస్తున్న వైద్యశాలకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఇందుకూరి శాంప్రసాదరెడ్డి తనయుడు ఇందుకూరి సిద్ధార్థరెడ్డి ఆధునిక పరికరాన్ని విరాళంగా అందజేశారు. రక్త నమూనాతో 160 వ్యాధులను గుర్తించే యూరిన్ కెమిస్ట్రీ అనలైజర్, ఆటోమోటెడ్ హెమటాలజీ అనలైజర్ అందజేశారు. రూ. 4 లక్షల విలువ కలిగిన ఈ పరికరానికి దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పరికరాన్ని తీసుకుని వచ్చిన ఇంజనీర్ నాగేంద్ర కుమార్, పీఆర్వో శ్రీనివాసరావు, వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

14న జాబ్‌మేళా



పోస్టరును విడుదల చేస్తున్న ఫిరోజ్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 14వ తేదీ నిర్వహించబోయే జాబ్‌మేళా పోస్టరును టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ శుక్రవారం విడుదల చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫిరోజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఫిరోజ్ మాట్లాడుతూ బొమ్మలసత్రంలోని ఆర్జీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ముంపు బాధితులకు పరిహారం అందేలా చర్యలు'



రైతుల వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయి పరిహారం అందని ముంపు బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొక్కెరంచ గ్రామంలో తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో హంద్రీనీవా సుజల స్రవంతి యూనిట్-4 అధికారులు శ్రీశైలం జలాశయం నిర్మాణంలో భూములు కోల్పోయి నష్టపరిహారం పొందని రైతుల వివరాల సేకరణకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అప్పటి జలాశయం నిర్మాణంలో పలు గ్రామాల నుంచి ఎంతో మంది రైతులు భూములు కోల్పోయారని, అధికారులకు వారి వివరాలను ఇస్తే నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. భూనిర్వాసితుల్లో సుమారు 313 మంది రైతులు ఈ గ్రామం నుంచి నష్టపరిహారం పొందలేదని వారిలో 167 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. కాగా 15 మంది రైతులు వారి పూర్తి వివరాలతో గ్రామ సభకు హాజరు అయ్యారన్నారు. వారి వివరాలను జిల్లా అధికారులకు నివేదికలు ఇస్తామని వారికి త్వరలో నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. గ్రామ సభలో హెచ్ఎన్ఎస్ఎస్ యూనియన్ సభ్యులు రిటైర్డు తహసీల్దార్ విజేయుడు, సర్వే శాఖ డీఈ శివశంకర్, డిప్యూటీ తహసీల్దార్ తాసీన్ అహ్మద్, ఆర్ఐ సుందర్‌రావు, వీఆర్వో వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


మిడుతూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మిడుతూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం నంద్యాల డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో రోగులకు అందించే చికిత్సల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉంటూ తగిన వైద్యం అందించి మందులను వైద్యశాలలోనే ఇవ్వాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిరుపతి, భరత్, శారద, వీణా, వైద్య సిబ్బంది సత్యనారాయన, మాదన్న, శ్రీజ, మున్నజావలి పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడు, ఉద్యోగిపై కేసు

● శ్రీశైలంలో మద్యం తాగుతుండగా అరెస్టు చేసిన పోలీసులు

సునిపెంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఓ ఇంట్లో మద్యం తాగుతుండగా వైసీపీ నాయకుడు ఎంఏ రజాక్‌ను, దేవస్థానంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ జి.ప్రసాదరావు తెలిపారు. వీరికి ప్రస్తుతం స్టేషన్ బెయిల్ ఇచ్చామని ఇచ్చినట్లు తెలిపారు. ఇద్దరినీ కోర్టులో హాజరు పరుస్తామని ఆయన చెప్పారు.

నేడు హోలీక్రాస్ సెంటీనరి చర్చి ప్రారంభం



నూతనంగా నిర్మించిన హోలీక్రాస్ సెంటీనరి చర్చి

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హోలీక్రాస్ చర్చి వందేళ్ల కానుకగా హోలీక్రాస్ సెంటీనరి చర్చి నిర్మించినట్లు ఇన్‌చార్జి బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ జార్జ్ కొర్నేలియస్ తెలిపారు. దీనికి గుర్తుగా నంద్యాలలో హోలీక్రాస్ కెథడ్రిల్ నూరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2005లో ఒక నూతన చర్చి నిర్మించాలని ఆలోచనతో అప్పటి బిషప్ రైట్ రెవరెండ్ జీటీ బిషప్ అబ్రహం పునాది వేశారు. కాలక్రమేణా పనులు పూర్తి కాక మరల 2010లో అప్పటి బిషప్ రెవరెండ్ లారెన్స్ మరొక పునాది వేసి దీనిని నిర్మించారు. 14ఏళ్ల క్రితం చేపట్టిన నిర్మాణం ప్రస్తుతం పూర్తయింది. తెలుగు డయాసస్‌లో ఉన్న బిషప్‌ల ద్వారా, ఇన్‌చార్జి బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ జార్జ్ కొర్నేలియస్ ఆధ్వర్యంలో శనివారం చర్చి ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చర్చి మేనేజర్ ప్రభుదాసు మాట్లాడుతూ హోలీక్రాస్ చర్చి అనేది 1884 సంవత్సరంలో ఎస్పీజీ హైస్కూల్, చర్చి నిర్మాణం తలపెట్టి 1925 లో నంద్యాలఅధ్యక్ష ఖండంలో లో హోలీక్రాస్ కెథడ్రిల్ చర్చి పూర్తిచేసి ప్రతిష్ఠించారు. నేటికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా గుర్తుగా నిర్మించారని తెలిపారు. ఈచర్చిలో ఒకేసారి వెయ్యిమంది క్రైస్తవులు ప్రార్థనచేసుకునే అవకాశంఉందన్నారు. జిల్లాలోనే అతి పెద్ద చర్చిగా ఈ నిర్మాణం కొనసాగించినట్లు తెలిపారు.

'ఉర్దూ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలి'



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఉర్దూ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. నంద్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫి మాట్లాడారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని ఇక్రా పాఠశాలలో కళాశాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు షాహిద్, మధు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందుకున్న చిన్నారులు, మహిళలు

వెలుగోడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు పౌష్టికాహారం అందించేందుకు అక్షయపాత్ర ముందుకు వచ్చింది. ఈ మేరకు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబందించి వెలుగోడులోని అబ్బిరాజుకుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిక చేసినట్లు అంగన్‌వాడీ టీచర్ అనితాబాయి తెలిపారు. ఈ మేరకు వారికి శుక్రవారం సీనాయర్ బాలమృతం కింద ఎనిమిది మందికి, జూనియర్ బాలామృతం కింద 31 మందికి పౌష్టికాహారం అందించినట్లు తెలిపారు

'పరీక్షల భయం వద్దు'



పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే విద్యార్థులు భయం వీడాలని ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. శుక్రవారం స్థానిక థెరిసా జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం పరీక్షలను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వచ్చిన వారు పరీక్షా పత్రాలను ఆవిష్కరించి ప్రసంగించారు. పది విద్యార్థులు పరీక్షల్లో భయాందోళనకు గురికాకుండా ఉండాలని సూచించారు. ప్రణాళికబద్ధంగా చదివి ఉపాధ్యాయులు సూచించి మార్గనిర్దేశంలో పరీక్షలను రాయాలని చెప్పారు. థెరిసా జూరియర్ కళాశాల డైరెక్టర్ సాయిప్రణీత్, ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్‌కుమార్, సాయిప్రశాంత్, బాలాజీ, అంజి, దిలీప్, రవి, చిన్న తదితరులు ఉన్నారు.

స్టేడియానికి చేరిన మ్యాట్లు



మ్యాట్లను వాహనం నుంచి దించుతున్న దృశ్యం

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మ్యాట్లు నంద్యాల స్టేడియానికి చేరాయి. జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో ఉన్న మ్యాట్‌లు, గత మూడు నెలలుగా ప్రవేటు టోర్నమెంట్‌లకు, ఇచ్చిన మ్యాట్లు ఆత్మకూరుకు చేరాయి. నంద్యాల డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు మ్యాట్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతిలో 'మ్యాట్లు ఎక్కడ?' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ వార్తకు జిల్లా క్రీడాఅభివృద్ధి అధికారి రాజు స్పందించి ఆత్మకూరులో ఉన్న దాదాపు 210 మ్యాట్‌లను నంద్యాల స్టేడియంకు తెప్పించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గీత కులాలకు మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందని, వారికి కేటాయించిన దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి శనివారం సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉందని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు తెలిపారు. శుక్రవారం నందికొట్కూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో గీత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా, వివిధ మండలాల కల్లు గీత కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడ్డ మద్యం, సారాను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు పర్యవేక్షణలో ధ్వంసం చేశారు. సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ 9 కేసులలో పట్టుబడ్డ 133 లీటర్ల నాటుసారా, 56 కేసులలో సీజ్ చేసిన 177 లీటర్ల మద్యం, 67 లీటర్ల బీరు ను ధ్వంసం చేశామని తెలిపారు.

నేడు టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం నేడు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే గ్రీవెన్స్‌లో మంత్రి పాల్గొన్ని అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'సీహెచ్‌సీలో అందుబాటులో ఇంజక్షన్'

పాణ్యం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుండెనొప్పి నుంచి సత్వర ఉపశమనం కోసం పాణ్యం సీహెచ్‌సీలో అందుబాటులో ఇంజక్షన్‌లు ఉన్నాయని వైద్యాధికారి డాక్టర్ రహేలా తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గుండెనొప్పి, భుజం నొప్పి లాంటివి వచ్చినపుడు స్థానికంగా ఉండే సీహెచ్‌సీలో పంచ్ అండ్ స్ట్రోక్ విధానంతో రూ. 40 వేల విలువ చేసే ఇంజక్షన్‌ను ఉచితంగా రోగికి వేయనున్నట్లు తెలిపారు. ఈసీజీ తీసి పెద్ద ఆసుపత్రికి తరలించి గుండె నిపుణుల ఆధ్వర్యంలో వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

15న దుకాణాల నిర్వహణకు వేలం

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానానికి చెందిన షాపుల బాడుగకు ఈనెల 15న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొను వారు వివరాల కోసం దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని ఈవో సూచించారు.

31మంది విద్యార్థులకు ఉద్యోగాలు

పాణ్యం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రాంగణ నియామకంలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి తెలిపారు. శుక్రవారం మెడిటెక్ హైర్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 31 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. కంపెనీ హెచ్ఆర్ అంజన్ ఆధ్వర్యంలో గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగంలో చేరనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్ అభినందించారు. ప్లేస్‌మెంట్, శిక్షణాధికారి డాక్టర్ బద్రీనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఇళ్ల మధ్య మాంసం దుకాణాలు తొలగించాలి'

పాములపాడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పాములపాడులోని నివాసాల మధ్య మాంసం దుకాణాలను దుకాణాలను తొలగించాలని చెలిమిళ్ళ రస్తాలోని ప్రజలు కోరారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మాంసం దుకాణాల వద్ద కుళ్లిన దుర్వాసలు వస్తున్నాయని, దీంతో చుట్టుపక్కల నివాసాలలో ఉండలేకపోతున్నామని చెప్పారు. ప్రధాన వీధుల్లోని దుకాణాలను గ్రామ శివారులోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఆబీద్ శుక్రవారం తెలిపారు. రెండో శనివారం కావడంతో గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీస్ అధికారులు శుక్రవారం తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, శాంతిభద్రతలను పరిరక్షించడం, నేరాలను నియంత్రించడం, రహదారులపై వాహనాల విస్తృత తనిఖీలు చేపట్టడం లాంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అక్రమ మద్యం, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు. ప్రధాన రహదార్లపై, ముఖ్యమైన కూడళ్లలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. పట్టణ శివార్లలో, నేరాలు జరిగే ప్రదేశాలు, ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా ఉంచి పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై చైతన్యం చేయడంతోపాటు ఓవర్ లోడింగ్, ట్రిబుల్ రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు.

'జయప్రదం చేయండి'

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో శనివారం ఆరోగ్యమాత క్షేత్రంలో నిర్వహించే యువత సదస్సు జయప్రదం చేయాలని డీన్ ఫాదర్ మర్రెడ్డి కోరారు. చర్చి ఫాదర్ ప్రసన్నకుమార్, కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫాదర్ మర్రెడ్డి మాట్లాడుతూ శనివారం నిర్వహించే యువత సదస్సులో యువతకు సరికొత్త పరిజ్ఞానాన్ని వారి భవిష్యత్తుకు ఎలా ఉపయోగించుకోవాలో వివరించనున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి కల్పనపై అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు సమావేశంలో ఫాదర్ రాజేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

ఎంఈవో-2గా రాజేంద్ర ప్రసాద్

గడివేముల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల హైస్కూల్ హెచ్ఎం రాజేంద్రప్రసాద్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ రెండవ అధికారిగా శుక్రవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంఈవో-2గా విధులు నిర్వహిస్తున్న విమలావసుందరాదేవి నవంబరు నెలలో పదవీ విరమణ చేయడంతో రాజేంద్రప్రసాద్ ఎంఈవో-2గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మార్సీ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో గడివేముల ఎంఈవో-1 మేరి సునిత, మిడ్తూరు ఎంఈవో శ్రీనాథ్, ఎమ్మార్సీ సిబ్బంది హిదయతుల్ల, విజయ్, సీఆర్పీ నాయక్‌లు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత

వెలుగోడు ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి చంద్రకాంత్ తనవంతు చేయూతనిచ్చారు. ఈ మేరకు పాఠశాలకు రూ.13 వేలు విలువ చేసే బెంచిలను పాఠశాలకు అందించారు. ఉపాధ్యాయులు బాబ మస్తాన్, సతీష్, సురేశ్, ఓబులేస్, శ్రీకాంతరెడ్డి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.30 కోట్ల విలువ చేసే స్థలం కబ్జా

● మహిళ ఆరోపణ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం రైతునగర్‌లో ఉన్న రూ.30కోట్ల విలువ చేసే స్థలాన్ని పట్టణానికి చెందిన ఒక ప్రముఖ డాక్టర్ కబ్జా చేశారని కత్తి శ్రావణి అనే మహిళ ఆరోపించారు. శుక్రవారం ఆమె నంద్యాల పట్టణంలోని సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన భూమిని కబ్జా చేసిన డాక్టర్‌కు కొందరు రెవెన్యూ అధికారులు, ఒక పోలీస్ అధికారి, ఓ వైసీపీ నాయకుడు సహకరించారని ఆరోపించారు. 2019లో తన స్థలం ఆక్రమణకు గురైందని తెలిసిందని, అప్పటి నుంచి న్యాయం చేయాలంటూ అధికారులను ఆశ్రయించినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా తనకు న్యాయం జరగలేదన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి తన దగ్గర ఉన్న ఆధారాలను పరిశీలించి న్యాయం చేయాలని బాధితురాలు కోరారు. భూమి కబ్జా చేశారనేందుకు సాక్ష్యాధారాలున్నాయని, న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను కోరారు.

జిల్లాలో 912 సీసీ రోడ్ల పనులు పూర్తి



చిన్నవంగలిలో ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఈఈ, డీఈ

చాగలమర్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పండుగలో భాగంగా 912 సీసీ రోడ్ల పనులు పూర్తి చేసినట్లు జిల్లా పంచాతీరాజ్ ఈఈ నాగరాజు తెలిపారు. శుక్రవారం చాగలమర్రి భూమానగర్‌లో రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులు, చిన్నవంగలి ఎస్సీ హాస్టల్‌లో రూ.29.35 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 31 హాస్టల్ భవనాలకు నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని యర్రగుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లోగల హాస్టళ్లకు మరమ్మతు పనులు చేపట్టామని అన్నారు. ఒక్కొక్క హాస్టల్‌కు రూ.29 లక్షలు నిధులు కేటాయించారని తెలిపారు. నంద్యాల జిల్లాలో పల్లె పండుగ కింద 1019 రోడ్లు మంజూరు కాగా 912 రోడ్లు పూర్తి చేసి రాష్ట్రంలోనే నంద్యాల జిల్లా ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. రూ.80.56 కోట్ల నిధులతో రోడ్ల పనులు చేపట్టామని అన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పీఆర్ డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈ కొండారెడ్డి, ఇంజనీరింగ్ సహాయకులు ఉన్నారు.

మస్టర్లు సక్రమంగా నిర్వహించాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కూలీల మస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఏపీవో నిర్మల సూచించారు. శుక్రవారం మండలంలోని కలుగొట్లపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని అన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని అన్నారు. 1450 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని అన్నారు. మార్చి చివరి నాటికి ఉపాధి పనుల లక్ష్యాన్ని అధిగమించాలని అన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న కేఈ కృష్ణమూర్తినగర్ కాలనీవాసులు

డోన్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): డోన్ పట్టణ సమీపంలోని వెంకటాపురం ప్రధాన రోడ్డులో సంజీవ ఆంజనేయస్వామి ఆలయ గుడి పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇవ్వాలని డోన్ కేఈ కృష్ణమూర్తినగర్ వాసులు కోరారు. వై.మాధవస్వామి, కార్పెంటర్ శివ, మహ్మద్, వెంగన్న, బోయ మధు, వడ్డె మద్దిలేటి, శంకరాచారి మాట్లాడుతూ కూలీ నాలి చేసుకుని కుటుంబాలు పోషించుకుంటున్న తమకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో నరసింహులును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మిద్దెపల్లెలో ఉరుసు ప్రారంభం

డోన్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిద్దెపల్లి గ్రామంలో శుక్రవారం మౌలాలి మిన్నెల్ల కాశీం స్వాముల 12వ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం జరిగిన ఉత్సవాల్లో భాగంగా స్వామివారి గంధం ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం ఉరుసు ఉత్సవాల సందర్భంగా రాతిదూలం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందే వృషభాల యజమానులకు రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు అందజేస్తామని తెలిపారు.

230 అనుమానిత కేసులు నమోదు

చాగలమర్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 సచివాలయాల పరిధిలో 230 కుష్టువ్యాధి అనుమానిత కేసులు నమోదైనట్లు వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధి సర్వే నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించారని అన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించడం జరుగుతుందని అన్నారు. 10న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1నుంచి 19 సంవత్సరాల లోపుగల వారికి ఆల్‌బెండజోల్ గుళికలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలకు 10 వేల ఆల్‌బెండజోల్ గుళికలను పంపిణీ చేశామని అన్నారు.

ఆళ్లగడ్డలో ముగిసిన పార్వేట ఉత్సవం



ఆళ్లగడ్డలో పూజలు చేసేందుకు తరలివచ్చిన భక్తులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీనృసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకి ఆళ్లగడ్డ నుంచి శుక్రవారం ఉదయం ఎస్ లింగందిన్నె గ్రామానికి చేరుకుంది. ఆళ్లగడ్డలో చివరి రోజు జ్వాలా, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించేందుకు భక్తులు తరలివచ్చారు. అనంతరం బోయిలు స్వామి వారి ఉత్సవ పల్లకిని లింగందిన్నె గ్రామంలో కొలువుంచారు.

10న రాష్ట్ర స్థాయి రాతి దూలం పోటీలు

ప్యాపిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఆర్‌పల్లి సమీపంలోని ప్రసిద్ధ పంచలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీన రాష్ట్ర స్థాయి రాతిదూలం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.3వేలు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

మాలల యుద్ధ గర్జన విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో 23న తలపెట్టిన మాలల యుద్ధగర్జనను విజయవంతంచేయాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడుదస్తగిరి, దళితసంఘం సీనియర్ నాయకుడు ఉబ్బరాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం కొలిమిగుండ్లలో మాలల యుద్ధ గర్జనకు సంబంధించి గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, నాగరాజు, అనిల్, నడిపెన్న, రాజశేఖర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాలు ఖాళీ
- పెద్ద దిక్కు లేక గాడి తప్పుతున్న పాలన
- జోడు పదవుల్లో తూతూమంత్రంగా బాధ్యతలు
- అతిథి సేవలతో ప్రజలకు అవస్థలు



చాగలమర్రి పోలీసు స్టేషన్



ఎంపీడీవో కార్యాలయం

ఇన్‌చార్జిల పాలనతో ఇక్కట్లు..!

చాగలమర్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని తూతూ మంత్రంగా ఇన్‌చార్జిలతో నింపేశారు. ఫలితంగా పాలన గాడి తప్పి ప్రజా సంబంధాలు, కార్యాలయ కలాపాలు అటకెక్కాయి. ఏ పనిముందుకు సాగాలన్న ఇన్‌చార్జి అనే కారణంతో వాటిని పట్టించుకోవడం లేదు. బాధ్యతలు చేపట్టిన అధికారులు అతిథి పాత్ర పోషిస్తుండటంతో ఆయా శాఖల్లో పారదర్శక పాలన, పర్యవేక్షణ లోపించింది. అటు ఉద్యోగులు, ఇటు కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బదిలీలు ఇలా.. బాధ్యతలు అలా..!

చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మహబూబ్‌దౌల మహానందికి బదిలీపై వెళ్లారు. జిల్లా ఇన్‌చార్జి డీపీవోగా విధులు నిర్వహిస్తున్న మంజులవాణి చాగలమర్రి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. నెల రోజులు తిరగక ముందే ఆమె ఉమ్మడి జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న రాజేంద్రప్రసాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టి విధులు నిర్వహి స్తున్నారు. విద్యుత్ కార్యాలయంలో ఏఈ షాజ హాన్ నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సబ్ ఇంజనీర్ రమణయ్య ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు. చాగలమర్రి మేజర్ పంచాయతీ ఈవోగా పని చేస్తున్న సుదర్శన్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈవో, ఈవోఆర్డీ రెండు శాఖల బాధ్యతలను ఆళ్లగడ్డ నుంచి వచ్చిన ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ విధులు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల నుంచి ఇన్‌చార్జిలతోనే కొనసాగిస్తున్నారు. మేజర్ పంచాయతీ మేస్త్రీ శివారెడ్డి రెండేళ్ల క్రితం పదవీ విరమణ చేశారు. పంచాయతీ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న ఓ వ్యక్తికే మేస్త్రీ బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ మేస్త్రీ లేకపోవడంతో పారిశుద్య కార్మికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో రెగ్యులర్ ఎస్‌ఐ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రమణయ్య సంజామల పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగా ఎస్‌ఐ రమేష్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కొన్ని నెలల విధుల అనంతరం ఎస్పీ ఆదేశాల మేరకు 40 రోజుల క్రితం చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి రెగ్యులర్ ఎస్‌ఐ లేకపోవడంతో ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పోలీసు స్టేష్‌లో రెగ్యులర్ ఎస్‌ఐ లేకపోవడంతో కింది స్థాయి పోలీసు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. రెండు శాఖల పనిభారంతో ఇన్‌చార్జి ఎస్‌ఐ కూడా విధులు నిర్వహించేందుకు ఇబ్బందిగా మారింది. కీలక పదవుల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించి పాలన సక్రమంగా కొనసాగేలా చూడాల ప్రజలు కోరుతున్నారు.

రసాభాసగా సామాజిక తనిఖీ ప్రజా వేదిక

- ఉపాధి నిధుల దుర్వినియోగంపై విచారణ
- గృహ నిర్మాణ బిల్లుల్లో అవకతవకలు
- రూ.1.30 లక్షల రికవరీకి ఆదేశం



సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఉపాధి అధికారులు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక రసాభాసగా సాగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ ద్వారా రూ. 6.27 కోట్ల నిధులు ఖర్చు చేశారు. గత వారం రోజులుగా మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటించి పనులను పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో గ్రీన్ అంబాజిటర్లకు, ఆయాలకు మస్టర్లు వేయటం, వలంటీర్లకు మూడు రోజుల కంటే ఎక్కువగా పనిదినాలు కల్పించినట్లు మస్టర్లు వేసి నిధులు దుర్వినియోగం చేశారని పరిశీలన అధికారి, ఏపీడీ బాలాజీనాయక్ గుర్తించారు. దీనిగాను రూ. 1,30,304 నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించి సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే సర్వాయిపల్లె గ్రామంలో పనిప్రదేశ గుర్తింపును సరిగా చూపకపోవడంపై ఉపాధి సిబ్బంది, తనిఖీ బృందం మధ్య కొద్ది సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిగా గాను ఆ గ్రామ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్‌అసిస్టెం టుకు క్రమశిక్షణ చర్యల కింద రూ. 8 వేల జరిమానా విధించారు. అలాగే తుడుమల దిన్నె గ్రామంలో 8 పాత గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లిం చినట్లు తనిఖీ బృందం గుర్తించింది. దీని సంబంధించి అధికారులు విచారణ జరపాలని ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీవో ఉమ మహేశ్వరరావు, క్యూసీ గంగాధర్‌రావు, ఎస్‌ఆర్పీ మురాద్, ఏపీవో రవిప్రకాష్ తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో



రాజనగరంలో స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

శిరివెళ్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని డీఈవో జనార్దన్‌రెడ్డి సూచించారు. మండలంలోని రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు పరీక్షల్లో రాణించేందుకు సమతుల ఆహారం, ధ్యానం, సరైన నిద్ర అవసరం అన్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డీటీ శంకర్ ప్రసాద్, హెచ్‌ఎం పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: త్వరలో జరుగబోయే పది పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని భీమునిపాడు ఉన్నతపాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులచే ముఖాముఖి సమావేశం నిర్వహించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించి అదనంగా స్టడీ క్లాసులు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కోవెలకుంట్ల పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నతపాఠశాలలో జరిగిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

దొర్నిపాడు: పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దొర్నిపాడు జడ్పీహెచ్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈవో మాట్లాడుతూ పది పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థులు బాగా చదివి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఉన్నత చదువులకు పది పరీక్షలు పునాది లాంటిదని అన్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగే ప్రత్యేక తరగతులకు చాలా మంది విద్యార్థులు హాజరు కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. నిల్వ ఉంచిన స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. 113 బస్తాల పీపీఎల్ కంపెనీకి సంబంధించిన యూరియా నిల్వలకు సరైన బిల్లులు లేని కారణంగా రూ.30,180 విలువైన యూరియా అమ్మకాలు నిలుపుదల చేశామని అన్నారు. వాటికి సంబంధించిన బిల్లులు వారంలోపు సమర్పించాలని లేక పోతే స్టాక్‌ను సీజ్ చేసి 6ఎ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధిక ధరలకు యూరియాను విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని అన్నారు. ఆయన వెంట ఏఈవో ఫరూక్, వీహెచ్‌ఏలు ఉన్నారు.

ఘనంగా పల్లకి సేవ ఉత్సవాలు

బనగానపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రంలో తిరుచ్చి వేడుకలు



స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో తిరుచ్చి వేడుకలు వైభవంగా శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

లాడ్జిల రికార్డులు పరిశీలన



అహోబిలంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అశ్విన్ కుమార్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలోని లాడ్జిలు, వాటి రికార్డులను ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అశ్విన్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. లాడ్జిల నిర్మాణానికి గ్రామ పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులు, చెల్లిస్తున్న పన్నులు, స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు తదితర వాటన్నింటిని లాడ్జిల యజమానులు ఆళ్లగడ్డ ఎంపీడీవో కార్యాలయానికి తీసుకురావాలని నోటీసులు జారీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం అనుమతులు లేకుండా నిర్మించిన లాడ్జిలకు, ప్రభుత్వ నిబంధనలు పాటించని లాడ్జిల యజమానులకు నోటీసులు అందించి వాటిని సీజ్ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

సాగు నీటిని పొదుపుగా వాడండి



రుద్రవరం సమీపంలో గంగ 22వ బ్లాక్ చానల్ తూమును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ ఇంజనీర్ శివప్రసాద్‌రెడ్డి

రుద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : రైతులు సాగునీటిని పొదుపుగా వాడితే వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని తెలుగుగంగ సూపరింటెండెంట్ ఇంజనీర్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తెలుగుగంగ ప్రధాన కాల్వ వెంట నీటి సామర్థ్యాన్ని పరిశీలించామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటి సామర్థ్యం 16.95 టీఎంసీలకుగాను ప్రస్తుతం 8.694 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. 1వ కిలోమీటర్ నుంచి 65వ కిలోమీటరు వరకు నీటి సామర్థ్యాన్ని కాల్వలో పరిశీలించామన్నారు. తుండ్లవాగు రిజర్వాయర్‌లో 0.013 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. వెలుగోడులో తెలుగుగంగ ప్రధాన కాల్వకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా తుండ్లవాగు రిజర్వాయర్‌కు 800 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ఆయన వెంట ఈఈ శివశంకర్‌రెడ్డి, డీఈ వెంకట రమణ, జేఈ వినయ్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ ప్రాంగణంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల డిపో పరిధిలో ఏవైనా సమస్యలు ఫిర్యాదులు ఉంటే సెల్ నంబరు 9959225798లకు తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బీటీ రోడ్లకు ప్రతిపాదనలు

బనగానపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకర్గంలో బీటీ రోడ్ల నిర్మాణాలకు, బ్రిడ్జి నిర్మాణాల అభివృద్ధి కోసం రూ.371 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో నియోజకవర్గంలో 139.37 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయడానికి రూ.371 కోట్లు అవసరమని నివేదిక తయారు చేసి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి అందజేశామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

గుండె జబ్బులపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సాగరిక

బేతంచెర్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : గుండె జబ్బులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సాగరిక అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గుండె జబ్బులు అధికమయ్యాయని, ప్రజలు జంకు ఫుడ్‌ను తగ్గించాలని, ఉదయం, సాయంత్రం వాకింగ్, వ్యాయమం చేయాలన్నారు. గుండెపోటుకు గురైన వారి ప్రాణం నిలిపేందుకు మొదటి గంటలోపే టెనెక్టెప్లేస్-40 అనే ఇంజెక్షన్ ఇవ్వాలని, దీని విలువ రూ. 40 వేల వరకు ఉంటుందన్నారు. ఈ ఇంజెక్షన్‌ను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వేస్తారని తెలిపారు. ఎవరైనా గుండెపోటుకు గురైతే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా నిర్వహించాలి



బీసీ హాస్టల్ విద్యార్థినులతో జిల్లా అధికారులు

చాగలమర్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ముస్తక్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి బీసీ బాలికల హాస్టల్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పది విద్యార్థినులకు రైటింగ్ ప్యాడ్స్, జామెంటరీ బాక్సులు, పెన్నులు పంపిణీ చేశారు. పది విద్యార్థినులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంఈవో న్యామతుల్ల, హాస్టల్ వార్డెన్ హరిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

అక్రమాలకు స్టాంప్..!

- తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్లు
- స్టాంప్ వెండర్‌పై ఆరోపణలు



బేతంచెర్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాలు జరిగిపోతున్నాయి. నిషేధిత భూములు సైతం రిజిస్ట్రేషన్ అయిపోతున్నాయి. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అక్రమాలు జరిగిపోతున్నాయి. డబ్బు ముడితే చాలు నిషేధిత జాబితాలో ఉన్నా సరే రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. ఇందులో ఓ స్టాంప్ వెండర్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలోని గూటుపల్లెకు చెందిన కుర్ని పకీరయ్య హంపమ్మ అనే దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం. ఆ మేరకు రెవెన్యూ అధికారులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా మంజూరు చేశారు. అయితే రెవెన్యూ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ కాదని ఇక్కడ ఉండే ఓ స్టాంప్ వెండర్ తప్పుడు సర్టిఫికెట్ తయారు చేసి ఇచ్చాడు. ఆ మేరకు కుర్ని పెద్దరాజు, బండ కొండయ్యలు మాత్రమే కుమారులు అని అందులో చూపించాడు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా వీరి భూమిని కొనగంటి బూసిరెడ్డి కుమారుడు నారాయణరెడ్డికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడు. (దస్తావేజు నెంబరు 5026/2024) ఇందుకు ఇందుకు రూ.5 లక్షలు వసూలు చేశాడని సమాచారం. అలాగే పట్టణంలోని రోటరీ క్లబ్ వెనుక ఉన్న రీడ్ కళాశాల స్థలాన్ని కూడా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించాడనే ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా ప్రభుత్వ, వక్ఫ్ భూములను సైతం రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ-స్టాంపుల అమ్మకాల్లోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. రూ.50, రూ.100 స్టాంపులపై అదనంగా రూ.50 వసూలు చేస్తున్నాడని జనాలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు సదరు స్టాంప్ వెండర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

● సబ్ రిజిస్ట్రార్ వనితలక్ష్మి వివరణ

ఈ ఏడాది జూలైలో ఓ వెండర్ కుటుంబ సభ్యుల పేర్లు తయారు చేసి రిజిస్ట్రేషన్‌లో అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. ఇంతకు ముందు ఏమి జరిగిందో నాకు తెలియదు. ఈ ఘటనపై లోతుగా విచారణ జరుపుతాం.